సాక్షి పెద్దపల్లి

గురువారం : 7 : మార్చి : 2024



ముగిసిన చిడుతల రామాయణం

ముత్తారం: లక్కారంలో నాలుగు రోజులుగా జరిగిన చిడుతల రామాయణం బుధవారం ముగిసింది. సీతారాముల పట్టాభిషేకం నిర్వహించారు.

మహాగణపతికి మకర తోరణం



మంథని: అష్టబుజ మహాగణపతికి బుధవారం నూతనంగా మకర తోరణం అలంకరించారు. పట్టణానికి చెందిన ఓ భక్తుడు సొంత ఖర్చులతో తయారు చేయించి బహూకరించారు.

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పనుల్లో పారదర్శకత పాటించాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ రవీందర్ రాథోడ్

జూలపల్లి(పెద్దపల్లి): గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్‌రాథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని కుమ్మరికుంట, పెద్దాపూర్ గ్రామాల్లో చేపట్టిన కాంటూరు కందకాల పనులను పరిశీలించారు. వేసవిలో కూలీలకు ఏర్పాటు చేసిన వసతులు, తాగునీటిపై అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత, సరైన కొలతలు చూసుకోవాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. పీడీ వెంట ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో పద్మజ, ఏపీఎం సదానందం, టీఏ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శులు అంజలి, పున్నమయ్య, ఎఫ్ఏలు మల్లేశం, అజయ్ తదితరులున్నారు.

మహిళా శక్తిని ప్రపంచానికి చాటేలా కృషి



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మహిళా శక్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. నారీశక్తి వందన్ అభియాన్‌లో భాగంగా బుధవారం మంథనిలోని బీజేపీ కార్యాలయంలో మహిళలతో శక్తి వందన్ నిర్వహించారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో మహిళలకు మేలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళలకు భవిష్యత్‌లో మరిన్ని ఫలాలు అందాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, నాంపల్లి రమేశ్‌తో పాటు మండల, మహిళా మోర్చా అధ్యక్షులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,358



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,358 పలికింది. కనిష్టంగా ధర రూ.6,081 కాగా, సగటు ధర రూ.7,157గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

మహిళ హక్కుల రక్షణకు పోరాడుదాం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: మహిళల హక్కుల రక్షణకు సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి అన్నారు. బుధవారం ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాతంత్ర భారతావనిలో మహిళలు సంపూర్ణమైన రాజకీయ, ఆర్థిక స్వయం నిర్ణయాధికారాన్ని సాధించలేక పోయారన్నారు. నిత్యం మహిళలపై జరుగుతున్న హింస దాడులు అత్యాచారాలు హత్యలు, మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు బుచ్చమ్మ, అమృత, కవిత, శారద, కళ్యాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యురాలిగా సనాఫక్రుద్దీన్



కోల్‌సిటీ: హజ్‌కమిటీ రాష్ట్ర సభ్యురాలిగా రామగుండం కార్పొరేటర్ సనాఫక్రుద్దీన్‌ను నియమించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్‌కు సనాఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీల్లో.. టికెట్ రేస్

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా 'కొప్పుల' ఖరారు
- కాంగ్రెస్, బీజేపీ టికెట్ల కోసం ఆశావహుల ప్రయత్నాలు
- జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయాలు



సాక్షి, పెద్దపల్లి: మరికొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రానుండటంతో జిల్లాలో రాజకీయాలు క్రమేపి వేడెక్కుతున్నాయి. బీఆర్ఎస్ తరుపున ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరు ఖరారు కావడంతో, కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులు టికెట్ ఎవరికొస్తుందోనని ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లోనూ విజయఢంకా మోగించాలనే కృతనిశ్చయంతో ఉంది. మరోవైపు సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లోకి జంప్ అయినప్పటికీ, బీఎస్పీతో పొత్తుతో తిరిగి సిట్టింగ్ స్థానంలో పాగావేయాలని ఆలోచనలో గులాబీ పార్టీ ఉంది. ఇక కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తామనే ధీమాలో ఉన్న బీజేపీ సైతం గెలుపుపై ఆశలు పెట్టుకుంది. దీంతో బీఆర్ఎస్‌తో పోలిస్తే ఈరెండు పార్టీల్లో బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపేవారు ఎక్కువగా ఉండటంతో తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో టిక్కెట్ దక్కించుకునే అదృష్టవంతుడెవరోననే చర్చ జిల్లాలో జోరుగా జరుగుతుంది.

ఊపు మీదున్న కాంగ్రెస్

పార్లమెంట్ పరిధిలో ఏడు స్థానాలకు ఏడు గెలిచే ఊపు మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించడంతో పాటు, డీసీసీ, ఇతర ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకున్న రాష్ట్ర నాయకత్వం పలువురి పేర్లతో కూడిన జాబితాను కేంద్ర నాయకత్వానికి పంపినట్లు తెలుస్తోంది. స్థానికంగా మాదిగ సామాజికవర్గం, స్థానిక నేతలే టిక్కెట్ కేటాయించాలని కొద్దిరోజులుగా వివిధ ప్రజాసంఘాలు, కులసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రధానంగా సిట్టింగ్ ఎంపీ వెంకటేష్‌నేత, గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎంపీ సుగుణకుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, పెర్క శ్యాం, గజ్జల కాంతం పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే ఢిల్లీ వేదికగా పార్టీ స్క్రీనింగ్ కమిటీ నేడు లేదా రేపు ప్రకటించనున్న నేపథ్యంలో ఎవరి పేరును ప్రకటిస్తుందోనని అందరిలో ఉత్కంఠను రేపుతుంది.

కమలంలో ఇంకా స్తబ్ధతే

పార్లమెంట్ ఎన్నికల్లో మిగితా పార్టీల కంటే బీజేపీ పార్టీ ఒక్కడుగు ముందే ఉంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 195మంది, రాష్ట్రంలో 9మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. అయితే పెద్దపల్లి పార్లమెంట్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎవరనే విషయంలో ఇంకా స్తబ్ధతే కొనసాగుతోంది. చాలామంది ఆశావహులు ఇప్పటికే అధిష్టానం పెద్దలను కలుస్తూ తమ అభ్యర్థిత్వం పరిశీలించాల్సిందిగా కోరుతున్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ ఎస్సీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేందర్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ నాయకుడు ఆయోధ్య రవి, క్యాతం వెంకటరమణ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్టానం సైతం వారి వివరాలను పరిశీలిస్తూనే, మరో పక్క ఇతర పార్టీల నుంచి ఎవరైనా బలమైన నాయకుల రాక కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఆఫీసు బేరర్లు, ముఖ్య నేతల అభిప్రాయాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు సమాచారం. వీరిలో ఒక్కరిని రెండో విడుత జాబితాలో వెల్లడించనున్నారు.

ఆశావహుల హడావుడి

లోక్‌సభ ఎన్నికల పోరుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ కేటీఆర్, కేసీఆర్ అధ్యక్షతన ఇప్పటికే నియోజకవర్గ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశాలు నిర్వహించి, ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలపై సమాలోచనలు జరిపారు. తాజాగా బీఎస్పీ పార్టీతో పొత్తుతో పార్టీ బలం పెరిగే అవకాశాలు పెరిగాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నాయి. బీజేపీ కొమరంభీం విజయసంకల్ప యాత్రతో బస్‌యాత్రలు నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ సైతం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అవుతోంది. ఆశావహులు నియోజకవర్గ పరిధిలో వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలతో ప్రచారం చేసుకుంటూనే, మరోపక్క ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



మంగళసూత్రం చూపిస్తున్న ప్రధాన అర్చకుడు వీరభద్రయ్య

కల్యాణం.. కమనీయం

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సతీమణి పావని పట్టువస్త్రాలతో పాటు తలంబ్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డిలతో పాటు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – ఓదెల(పెద్దపల్లి)





పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే సతీమణి పావని, కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పార్లమెంట్ ఎన్నికలకు రెడీ కావాలి



పార్లమెంట్ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

- విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో డీసీపీ చేతన, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిబంధనల అమలులో అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. ఇందులో సెక్టోరల్ అధికారులు బూత్‌స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ సమయంలో మాక్ పోలింగ్‌తోపాటు పోలింగ్ వివరాలను గంట, గంటకు వివరాల నివేదికలివ్వడం లాంటి పనుల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీలకు ప్రజలు సహకరించాలని డీసీపీ చేతన అన్నారు. సమావేశంలో ఆర్డీవోలు మధుమోహన్, హనుమానాయక్, డీసీవో శ్రీమాల, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగుతూ ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్‌జీవోల ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి ప్రారంభించారు. సమాజంలో లింగ సమానత్వం, మహిళలు అన్నిరంగాల్లో పోటీ పడేలా ముందుకు వచ్చే అంశాలపై చర్చించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నపుడే అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. మహిళా సాధికారిత సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. టీఎన్జీవోల సంఘ అధ్యక్షుడు బొంకూరి శంకర్, కోఆర్డినేటర్ దయా అరుణ, స్వప్న పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

జూలపల్లి(పెద్దపల్లి): జూలపల్లి మండలం కాచాపూర్‌లో బుధవారం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆకస్మిక పర్యటించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. పాఠశాల మధ్యాహ్న నిర్వాహకుల సమస్యలు తెలుసుకొని సహపంక్తి భోజనం చేశారు. ఆశా కార్యకర్తలను సన్మానించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి మాధవి, ఎంపీడీవో పద్మజ, హెచ్‌ఎం శ్రీధర్, కార్యదర్శి శరత్, మాజీ సర్పంచ్ ఆకుల రాజయ్య, ఏఎస్ఎం రామాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న మెగా జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్: ఈనెల 16న మెగా జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ విజయవంతానికి సమీక్ష సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు చెక్ బౌన్స్, భార్యభర్తల తగాదాలు, ఇరువర్గాలు రాజీ కు దుర్చుకునేలా న్యాయవాదులతో పాటు కక్షిదా రులు, పోలీసులు సమన్వయపరుస్తూ ముందుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్ర సాద్, సీనియర్ న్యాయవాదులు ఆంజనేయులు, దివాకర్ రావు, శ్రీనివాసరావు, ఏజీపీ తిరుపతి రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మీరాజం, భూమయ్య, రాజు, శివ, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమూల మార్పులు

మహిళకు విద్యతోనే సమూల మార్పులు వస్తాయని మున్సిఫ్ కోర్టు జడ్జి ప్రియాంక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ గుర్తింపు తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ తిరుపతిరెడ్డి, బార్ అసోసియేషన్ చైర్మన్ బాలకృష్ణ ప్రసాద్, హెచ్‌ఎం విజయ్ రావు ఉపాధ్యాయులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగానే చేయాలి



పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో చేపట్టిన నిరసన దీక్షలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై నిర్ణయాలు తీసుకోవడం మాని ఉచితంగానే ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయాలని సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో పలువురు నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు క్రమబద్ధీకరణ చేసేందుకు ఆనాటి సీఎం కేసీఆర్ సారథ్యంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. గత ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక బీఆర్ఎస్ పాలకులపై అవినీతి ముద్ర వేసేందుకే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చౌకబారు ఎత్తులను ప్రజలంతా గ్రహిస్తున్నారన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్‌తో పాటు నాయకులు బండారి స్రవంతి, శ్రీనివాస్, దేవయ్య, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మేయర్ అనిల్‌కుమార్



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ఆర్‌సీవో క్లబ్‌లో బుధవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు సద్వినియోగం కావడంలో మహిళలు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. తన కుటుంబంలో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వేసేలా మహిళలు చూడాలని అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఉపయోగించుకోవడం ప్రతీఒక్క ఓటరు బాధ్యతన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా, స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు రంగోళి, మెహందీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి మేయర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, మెప్మా డీఎంసీ రజనీ, రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్లు, ఆర్‌పీలు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలి

గోదావరిఖని: సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రతిఒక్కరూ తమ వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ సుమారు 350కిలోమీటర్ల కమ్యూనికేషన్ నెట్‌వర్క్ విస్తరించి ఉందన్నారు. 5వేలకు పైగా కంప్యూటర్లను వాడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీతో పాటు సైబర్ నేరాలు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయన్నారు. కంపెనీ విలువైన విషయాలు, నగదు సంబంధించి పర్సనల్‌డేటాను గోప్యంగా ఉంచాలని సూచించారు. సైబర్ అటాక్‌లు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అధికారులు రాంమోహన్, లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాస్‌రావు, శ్రావణ్‌కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో బలపడుతున్న 'హస్తం'

- కాంగ్రెస్‌లో చేరిన మేయర్, 16మంది కార్పొరేటర్లు
- నిధుల మంజూరుతో వలస బాట
- మరికొంతమంది చూపు చేయి వైపు



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం



కాంగ్రెస్‌లో చేరిన మేయర్, కార్పొరేటర్లు

గోదావరిఖని: రామగుండం బల్దియాలో చేయికి బలం చేకూరుతోంది. ఓవర్‌లోడ్‌గా ఉన్న కారు ఖాళీ అవుతోంది. కార్పొరేటర్లు కారు దిగి అధికార కాంగ్రెస్ చేయి పట్టుకుంటున్నారు. ఒకేసారి మేయర్‌తో పాటు 16మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడంతో అధికార కాంగ్రెస్ పార్టీ బలం రెట్టింపు అయింది. రామగుండం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పార్టీ బలోపేతంపై దృష్టిసారించారు. రాబోయే పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో బల్దియాలో పెండింగ్ పనులపై దృష్టిసారించారు. అభివృద్ధి కోసం రూ.126కోట్లు మంజూరు చేయించారు. రూ.34కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులను రామగుండానికి వచ్చేలా చేశారు. నిధులు మంజూరుతో కార్పొరేటర్లు అధికార పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం మేయర్‌తో పాటు కార్పొరేటర్లు అధికార పార్టీవైపు క్యూకట్టారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో పాటు 16మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆతర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశారు.

కాంగ్రెస్‌కు పెరిగిన బలం

బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికతో బల్దియాలో కాంగ్రెస్ బలం పెరిగింది. 50మంది కార్పొరేటర్లు ఉన్న రామగుండం కార్పొరేషన్‌లో 11మంది కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఉన్నారు. మరో 16మంది బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికతో బలం 27కి చేరుకుంది. మరికొంత మంది చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలున్నాయి.

వివాదాస్పద కార్పొరేటర్లకు నోచాన్స్

అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు కార్పొరేటర్లు క్యూకడుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా వ్యవహరించిన కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకోవద్దనే దృఢనిశ్చయంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ ఉన్నట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా రాబోయే ఎన్నికల్లో టికెట్లు కేటాయించడం కూడా కష్టంగా ఉండకూడదన్న ఆలోచనతో ఆచీతూచీ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. వివాదాస్పదమైన వారిని పార్టీలోకి తీసుకుని ఇబ్బంది పడేకన్నా దూరంలో ఉంచడమే మేలని ఎమ్మెల్యే భావించినట్లు తెలిసింది.

నిధుల కేటాయింపుపై కసరత్తు

ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ బల్దియాకు నిధుల కేటాయింపుపై తీవ్రమైన కసరత్తు ప్రారంభించారు. రూ.160కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిలో రూ.34కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులున్నాయి. అయితే విపక్షంలో ఉంటే డివిజన్‌లో అభివృద్ధి పనులు నిలిచిపోతాయని అధికార పార్టీలో చేరి డివిజన్‌లో అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేసి రాబోయే ఎన్నికల్లో మళ్లీ పోటీలో ఉండాలనే ఆలోచనతో చాలామంది కార్పొరేటర్లు అధికార పార్టీ వైపు దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. ఏదిఏమైనప్పటికి నిధులతో పాటు అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో ముందుకు వెళ్లేలా ప్రణాళికతో ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కూడా ఈచేరికలు దోహదం చేస్తాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరి మృతి


ముకుందరావు (ఫైల్)

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బిస్సాడి ముకుందరావు (58) రైలు కింద పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి మృతి చెందాడని, మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తామని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్ గ్రామంలో బుధవారం మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా చింతలదాబాకు చెందిన అక్షయ్ సదాశివ్ కుంబరే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిక్ కంపెనీలో పనిచేస్తున్న అక్షయ్ సదాశివ్ కుంబరే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితుడు మృతి చెందగా స్వగ్రామానికి వెళ్లివచ్చి స్నేహితుడి మృతి తట్టుకోలేక మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సదాశివ కుంబరే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపారు.

ఇంటికి చేరిన వలస జీవి మృతదేహం


శ్రీకాంత్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం మలేషియా వెళ్లిన మండలంలోని కొలనూర్‌కు చెందిన సుదమల్ల శ్రీకాంత్ (33) అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోగా.. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీకాంత్ గత జనవరి 22న పక్షవాతానికి గురికాగా.. సరైన వైద్యం అందలేదు. పక్షవాతంతో బాధపడుతున్న శ్రీకాంత్‌ను తీసుకొచ్చేందుకు కుటుంబీకులు మలేషియా వెళ్లినా తీసుకొచ్చేందుకు అక్కడి కంపెనీ అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్వదేశానికి తిరిగొచ్చారు. కాగా ఫిబ్రవరి 22న శ్రీకాంత్ మృతిచెందాడు. మృతునికి భార్య లహరి, కూతురు ప్రణీత(3), కుమారుడు శ్రీహన్స్(18 నెలలు) ఉన్నారు.

11న విదేశీ ఉద్యోగ నియామకాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: విదేశీ ఉద్యోగ నియామకాలపై ఈనెల 11న సికింద్రాబాద్ ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో టామ్‌కాం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కాం) అవగాహన కార్యక్రయం నిర్వహిస్తోందన్నారు. 21–38 ఏళ్ల వయస్సు కలిగి బీఎస్సీ అర్హత గల నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు నర్సింగ్ కేరీర్ అవకాశాల కోసం హాజరు కావాలని సూచించారు. జర్మన్ భాషపై నివాస శిక్షణ, జర్మనీలో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలను టామ్ కాం ద్వారా ఎంపిక చేయబడిన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నర్సింగ్ అభ్యర్థులు సెల్ నంబర్ 9908830438, 6302292450, 8919047600, 7901290580 నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

సంతోషం.. అంతలోనే విషాదం

- రెండు ఉద్యోగాలు సాధించిన భార్య
- విందు ఇవ్వాలని కోరిన స్నేహితులు
- ఇంటి నుంచి వెళ్లిన గంటకే రోడ్డు ప్రమాదం
- ముందునుంచి వేగంగా వచ్చి కబళించిన లారీ
- అక్కడికక్కడే దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు


ధర్మపురిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రాజశేఖర్ (ఫైల్)

ధర్మపురి: భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో ఆ ఇంట్లో విషాదం నిండింది. ఈ ఘటన ధర్మపురిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర కాలనీకి చెందిన నర్ముల రాజశేఖర్ (36) బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రాజశేఖర్ భార్య మనీషా ఇటీవల ప్రకటించిన టీజీటీ, పీజీటీలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. దీంతో పార్టీ (దావత్) ఇవ్వాలని తోటి మిత్రులు కోరారు. మంగళవారం సాయంత్రం బీర్‌పూర్‌లో విధులు ముగించుకుని ఇంటికి చేరిన రాజశేఖర్ నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో తన స్నేహితుడైన ధర్మపురికి చెందిన సిరుప బద్రి ఇంటి కొచ్చి పార్టీ కోసమని ద్విచక్రవాహనంపై మండలంలోని రాయపట్నం గ్రామానికి వెళ్లారు. విందు చేసుకుని తిరిగి వస్తుండగా బూరుగుపల్లె బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సిపతి బద్రి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇంటి నుంచి వెళ్లిన గంటలోపే..

ఇప్పుడే వస్తానంటూ రాజశేఖర్ మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. వెళ్లిన కొద్దిసేపటికే పార్టీ ముగించుకుని తిరుగు పయనమయ్యారు. అంతలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో భార్య, తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. రాజశేఖర్‌కు కుమారుడు శ్రీహర్ష ఒక్కగానొక్క కుమారుడు. అతడు తండ్రి చితికి నిప్పు పెట్టడం అక్కడున్న వారిని కలిచివేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

అమ్మా.. నాన్నకు ఏమైంది..?

- గుండెపోటుతో తండ్రి మృతి
- దిక్కులు చూస్తున్న పిల్లలు


రవి (ఫైల్)


అమాయకంగా చూస్తున్న చిన్నారులు

వెల్గటూర్ : 'అమ్మా.. నాన్నకు ఏమైంది..? నాన్నాను ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. ? మళ్లీ ఎప్పుడొస్తాడు..? అమ్మ ఎందుకు ఏడుస్తున్నావమ్మా..' అంటూ ఆ చిన్నారులిద్దరూ అమాయకంగా అడుగుతుంటే ఏమని చెప్పాలో తెలియక అక్కడున్న వారందరూ గుండెలవిసేలా రోదించారు. నాన్న దూరమై చిన్నారులు.. కట్టుకున్న వాడు దూరమై భార్య, వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు దూరమై గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మూగల రవి (35) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికొచ్చాడు. ప్రస్తుతం స్థానికంగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అప్పటివరకూ అందరితో కలివిడిగా గ్రామంలో తిరిగిన రవి గుండెనొప్పి బారిన పడడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. రవికి భార్య జ్యోతి (29), కూతుళ్లు శాన్వి (7), సమన్వి (4) ఉన్నారు. రవి తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. చివరి దశలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు దూరమై తల్లిదండ్రులు, తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో వారి రోదనలు మిన్నంటాయి. తండ్రికి ఏమైందో తెలియని ఆ చిన్నారులు అమాయకంగా చూస్తుండడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తాళం

- 14 నెలలుగా అద్దె చెల్లించని వైనం
- ఇంటి యజమానికి రూ.3.36లక్షల బకాయి
- ఎంపీటీసీ హామీతో తెరుచుకున్న కార్యాలయం


కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని

వెల్గటూర్ : జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం భవన యజమాని తాళం వేశాడు. కొత్తగా ఏర్పడిన ఈ మండలంలో 21 అక్టోబర్ 2022న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని రాయిల్ల భూమేశ్‌కు చెందిన ఇంటిని నెలకు రూ.24వేల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటినుంచి 14నెలలు గడిచినా అద్దె చెల్లించలేదు. బకాయి రూ.3.36లక్షలకు చేరింది. ఆ మొత్తం చెల్లించాలంటూ యజమాని భూమేశ్ కార్యాలయానికి ఉదయం తాళం వేశాడు. విద్యుత్ బిల్లు రూ.50 వేలకు చేరింది. కార్యాలయానికి తాళం వేయడంతో గంటపాటు సిబ్బంది బయటే వేచి చూశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంపీటీసీ బషీర్ హామీ ఇవ్వడంతో భూమేశ్ తాళాలు తీశాడు. పది రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకుంటే తాళం వేస్తానని భూమేశ్ హెచ్చరించారు.

సింగరేణిని అగ్రస్థానంలో నిలపాలి

- సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం


సీఅండ్ఎండీకి బొకే అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధి కోసం అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని సీఅండ్ఎండీ ఎన్.బలరాం కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో అధికారుల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికోసం ప్రతీ అధికారి, కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఉద్యోగులను చైతన్యపరుస్తూ ముందుకు నడపాలని సూచించారు. ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులు కూలకషంగా వివరించారు. సంస్థను అభివృద్ధి పథంలో నడపాలంటే ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాత్మక చర్యలను సూచించాలని అధికారులు కోరారు. కంపెనీ లాభదాయకంగా నడిస్తే కార్మికులతో పాటు అధికారులకు కూడా తగిన విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈసందర్భంగా అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీపతిగౌడ్, జనరల్ సెక్రెటరీ పెద్దినరసింహులతో పాటు కమిటీ నాయకులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

అధికారులకు ప్రోత్సాహం కల్పించాలి

సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న అధికారులకు తగిన ప్రోత్సాహం కల్పించాలని సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ కోరారు. అధికారులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేయాలని, ఉన్నత చదువులు చదివే అధికారుల పిల్లలకు కార్మికులకు మాదిరిగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. సమావేశంలో కోఆర్డినేషన్ జీఎం ఎం.సురేష్, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, పి.రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ బాలాజీనగర్‌లో గల సుచిత్ర అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కామారపు రమేశ్(60) అనే వృద్ధుడు పడి మృతిచెందినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కొత్తపల్లి పట్టణానికి చెందిన రమేశ్ ఏడాది క్రితం బాలాజీనగర్‌లోని సుచిత్ర అపార్ట్‌మెంట్‌లో ప్లాట్ కొనుగోలు చేసి నివాసముంటున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా.. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో ఉండే రమేశ్ బుధవారం కళ్లు కనిపించక ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి రైతు..

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన రైతు కట్కూరి నారాయణరెడ్డి(73) మంగళవారం రాత్రి పంట పొలాలకు నీరు మళ్లించే క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పొలాలకు నీరు మళ్లించేందుకు మరో నాలుగురు రైతులతో కలిసి హిమ్మత్‌నగర్‌కు వెళ్లే కాలువ తూములో ఇరుకున్న చెత్తను తొలగిస్తుండగా కాళ్లకు పొరక చుట్టుకోవడంతో నీటిలో పడి కొట్టుకుపోయాడు. తోటి రైతులు అప్రమత్తమై వెంటనే బయటికి తీసి చికిత్స కోసం జమ్మికుంటకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

జమ్మికుంట: ప్రమాదవశాత్తు చెరువులో పడి మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన కన్నెవేన కొంరయ్య అలియాస్ బక్కయ్య (68) జమ్మికుంట మున్సిపల్ నాయిని చెరువులో పడి చనిపోయాడు. ఇరవై ఏళ్లుగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజులకు ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఓ రైతు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి చెల్లి గంద్రకోట మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

మహాశివరాత్రి మహోత్సవానికి రండి




మంత్రి శ్రీధర్‌బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న శ్రీనివాస్, ఎంపీని ఆహ్వానిస్తున్న అధికారులు

వేములవాడ: మహాశివరాత్రి వేడుకలకు రావాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కలిసి ఆహ్వానపత్రికలు అందించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు ఆహ్వానపత్రికను ఆలయ పర్యవేక్షకులు హరినాథ్ అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన రాజన్న ఉత్సవ కమిటీ


కొలువుదీరిన కొత్త పాలకమండలి సభ్యులు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ సభ్యులుగా అనుమల్ల చంద్రం(జగిత్యాల), వడ్డేపల్లి వెంకటరమణ(హుస్నాబాద్), కె.రాజిరెడ్డి(సిరిసిల్ల), సి.విజయలక్ష్మి(మంథని), సాగరం వెంకటస్వామి(వేములవాడ), పాత సత్యలక్ష్మి(వేములవాడ), కూరగాయల కొమరయ్య(వేములవాడ), సంద్రగిరి శ్రీనివాస్(వేములవాడ), కనికరపు రాకేశ్ (వేములవాడ), నాంపల్లి శ్రీనివాస్(నాంపల్లి), పులి రాంబాబు(వేములవాడ), తూము సంతోష్(వేములవాడ), వకుళాభరణం శ్రీనివాస్(నూకలమర్రి), పిల్లి కనకయ్య(రుద్రవరం), సంగ స్వామియాదవ్ (శాత్రాజుపల్లి), జగన్మోహన్‌రెడ్డి(నిజామాబాద్), చేపూరి గంగయ్య(నిమ్మపల్లి), చింతపంటి రామస్వామి(నర్సింగాపూర్), కాయితి నాగరాజు(దుంపేట), తొట్ల అంజయ్య(పోతారం), ఏనుగు రమేశ్‌రెడ్డి(దమ్మన్నపేట), సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి(మన్నెగూడం), ధార్న మల్లేశం(రుద్రంగి)లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సమక్షంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఫెస్టివల్ కమిటీ సభ్యులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫెస్టివల్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ.. భక్తుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో గొర్ల కాపరి మృతి


కొమురయ్య(ఫైల్)

ఓదెల/జమ్మికుంట:: ఓదెల మండలం జీలకుంట గ్రామ శివారులో అబాది జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య (60) గొర్ల కాపరి విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ము కొమురయ్యతో పాటు మరో ముగ్గురు పదిరోజుల క్రితం గొర్లను మేత కోసం జీలకుంటకు తీసుకొచ్చారు. గొర్లు మేత మేస్తుండగా కొమురయ్య బహిర్భూమికి వెళ్లాడు. జీలకుంటకుచెందిన బంగారి కొమురయ్య తన పంటలను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్ తీగ అమర్చాడు. బహిర్భూమికి వెళ్లిన కొమురయ్య పంటకు అమర్చిన విద్యుత్ వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సురేశ్, కూతురు ఉంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కొమురయ్య మృతదేహం

విద్యుత్ వైరు రైతుపై కేసు

జీలకుంట గ్రామశివారులో అడవి పందులు, జంతువుల బారి నుంచి పంటలు కాపాడేందుకు విద్యుత్ వైరు అమర్చిన రైతు బంగారి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వీణవంకలో దొంగ రిజిస్ట్రేషన్ కలకలం

వీణవంక(హుజూరాబాద్): అమెరికాలో ఉన్న మహిళ పేరిట ఉన్న భూమిని ఆమెకు తెలియకుండా ఇతరులకు దొంగ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. తహసీల్దార్ తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీణవంక శివారులో రెండు వేర్వేరు సర్వే నంబర్లలో రామిడి సుప్రియ పేరిట 22 గుంటల స్థలం ఉంది. ప్రస్తుతం సదరు మహిళ అమెరికాలో ఉంటోంది. మండలంలోని ధరణి మాజీ ఆపరేటర్ అరుణ్‌తోపాటు సుకాసి సురేశ్, నీల పూర్ణచందర్, మహ్మద్ అక్బర్‌లు కుమ్మక్కై ఆమె ఫొటోను తీసి, సంతకం ఫోర్జరీ చేశారు. తహసీల్దార్ విధుల్లో లేని సమయం చూసి సుకాసి సురేశ్‌కు పట్టా చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వెంటనే తహసీల్దార్ తిరుమల్‌రావు స్థానిక పోసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ధరణి ఆపరేటర్‌ను తొలగింపు

ఇటీవల తహసీల్దార్ తిరుమల్‌రావుకు తెలియకుండా గతంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్, ధరణి ఆపరేటర్ అరుణ్ కలిసి ఓ గ్రామానికి చెందిన కుటుంబానికి నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ అరుణ్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. డీటీని కలెక్టరేట్‌కు సరేండర్ చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ విషయంలో ధరణి ఆపరేటర్‌పై మళ్లీ కేసు కలకలం రేపుతుంది.

కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు

బోయినపల్లి(చొప్పదండి): అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఒకరిని కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. 2017 అక్టోబర్ 4న రత్నంపేటలో పెంచలయ్య ఇంట్లోకి బిచ్చు అనే వ్యక్తి అక్రమంగా ప్రవేశించి కర్రతో కొట్టాడు. తలకు గాయమైందని పెంచలయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, బిచ్చును కోర్టులో హాజరుపరిచారు. బిచ్చుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

కమిషనర్ కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ముందు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు కారును బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కమిషనర్ కారు వెనుకభాగం దెబ్బతింది. ఘటనపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- గోడ కూలి ఇంటిపెద్ద అకాల మరణం
- తల్లికి మాటలు రావు.. చెవులు వినిపించవు
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు కూతుళ్లు
- దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

కాల్వశ్రీరాంపూర్: పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన పేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. గోడ కూలి ఇంటి పెద్ద అకాల మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు దిక్కులేనివారయ్యారు. తండ్రి మృతితో చెవిటి, మూగ అయిన తల్లికి తమ కష్టసుఖాలు ఎలా చెప్పుకునేది అంటూ.. ఇద్దరు ఆడపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

15ఏళ్ల క్రితం వలస వచ్చి..

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన నిమ్మ రవి(35) 15ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం తమ బంధువుల ద్వారా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి వలస వచ్చాడు. అతడికి భార్య కోమల (చెవిటి, మూగ), ఇద్దరు ఆడపిల్లలు సాత్విక(ఇంటర్), శ్రావిత (9వతరగతి) ఉన్నారు. గుంట భూమి లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. రవి వ్యవసాయ కూలీగా, ఐకేపీ వరిధాన్యం కొనుగోళ్ల సమయంలో హమాలీగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉండే రవి గత నెల 28న స్వగ్రామం కుందారంలో మల్లన్న దేవుడి బోనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు గోడకూలి మృత్యువాతపడ్డాడు. అనంతరం మృతదేహాన్ని బంధువులు మీర్జంపేటకు తీసుకొచ్చి గ్రామస్తుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు. పెద్దకూతురు సాత్విక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని పుట్టెడు దుఃఖంతో కరీంనగర్‌లో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తోంది. చిన్న కూతురు శ్రావిత కస్తూరిబా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అన్నీ తానై చూసుకున్న ఇంటిపెద్ద అకాల మరణంతో తామెలా బతికేది, తమ చదువులెలా సాగేది అంటూ ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. తమ చదువుల కోసం దాతలు తోచిన సాయం అందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. ఇటీవల అదే గ్రామానికి చెందిన దంపతులు డాక్టర్ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి–డాక్టర్ ప్రశాంతి రూ.50వేలు ఆర్థికసాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన వారు
బ్యాంక్ అకౌంట్ నంబర్
62279304181
నిమ్మ కోమల
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీహెచ్‌వై0020388